వైఎస్ విజయమ్మను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సుభాష్‌నగర్: వైఎస్సార్ సీపీ నేత సాతాల గోపాల్ ఆధ్వర్యంలో వైఎస్ విజయమ్మను గురువారం నగరంలోని లోటస్ పాండ్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. గాజులరామారం మహదేవపురం చౌరస్తాలో సెప్టెంబర్ 2న న దివంగత సీఎం వైఎస్ఆర్ విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో జగదీశ్వర్ రెడ్డి. మల్లు సురేందర్ రెడ్డి, వెంకటస్వామిరెడ్డి, ధనుంజయరెడ్డి, ఉత్తమ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే చెట్ల కొమ్మలు



గురుమూర్తినగర్ రోడ్డులో పడేసిన చెట్ల కొమ్మలు

రంగారెడ్డినగర్: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది రోడ్లపైనే వాటిని డంప్ చేసి చేతులు దులుపుకున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఎర్రగోడల నుంచి గురుమూర్తినగర్‌కు వెళ్లే దారిలో ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలను నరికివేయించారు. అయితే వాటిని తరలించాల్సి ఉండగా స్థానికంగానే వేసి వెళ్లిపోయారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా.. విద్యుత్ శాఖ సిబ్బందే తొలగిస్తారని చెబుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెట్ల కొమ్మలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయని, వాటిని వెంటనే తరలిచాలని గురుమూర్తినగర్ వాసులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చివేత



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి సర్కిల్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బాచుపల్లి ప్లైఓవర్‌పై అనేక గుంతలు ఏర్పడ్డాయి. మియాపూర్ వైపు, దుండిగల్ వైపు రహదారుల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు మట్టి బురదగా మారడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మియాపూర్ సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. గురువారం గుంతల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, వాటిని కాంక్రీటుతో నింపి రోడ్డు మరమ్మతులు చేపట్టారు.

31న గరికపాటి ప్రవచనం

నిజాంపేట్: శతావధాని, ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రవచనానికి నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నారు. గణేష్ ఉత్సవాలలో భాగంగా మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు ఆధ్వర్యంలో గణేష్ మండపం, హరితవనం కాలనీలో ఈ నెల 31న సాయంత్రం 7గంటలకు గరికపాటి నరసింహారావుచే ప్రవచనం ఉంటుందని తెలిపారు.

పార్కుల అభివృద్ధి పూర్తయ్యేనా?

నెల రోజులుగా పనుల సాగదీత

- అసంపూర్తి పనులతో బురదమయం
- కంకర తేలిన ట్రాక్‌లు

నిత్యం వాకర్లు, కాలనీ వాసులతో సందడిగా ఉండే ఆ పార్కులు జనాలు రాక బోసిపోయాయి. నెల రోజులుగా పార్కుల అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగిండంతో ఈ పరిస్థితి నెలకొంది. వాకింగ్ ట్రాక్‌లు బురదతో, రాళ్లతో నిండిపోవడంతో నడవడానికి వీలు లేకుండా పోయాయి. దీంతో వాకర్లు, చుట్టు పక్కల బస్తీల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కు నెంబరు-2 పంచవటి పార్కు



ఓపెన్ జిమ్ పనులు నాసిరకంగా చేపట్టడంతో పైకి లేచిన రబ్బర్ మ్యాట్స్



పంచవటి పార్కులో కంకరపోయి వదిలేసిన ప్రాంతం

రంగారెడ్డినగర్: డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయాన్ని ఆనుకుని పార్కు-1, అదే విధంగా పంచవటి పార్కు 2 లలో రూ.4 లక్షల నిధులతో వాకింగ్ ట్రాక్‌లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు శ్రీకారం చుట్టారు. సదరు కాంట్రాక్టర్ నెల రోజులుగా నత్తనడకన పనులు కొన'సాగ'దీస్తున్నాడు. దీంతో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులకు వచ్చే వాకర్లు, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులను అడిగితే ఇదిగో చేపడుతున్నాం.. అదిగో పూర్తి చేస్తామంటూ దాటవేస్తున్నారు.



ఏపీహెచ్‌బీ కాలనీ పార్కు-1లో బురదమయంగా మారిన వాకింగ్ ట్రాక్

డివిజన్ మొత్తానికీ ఇవే పార్కులు..

రంగారెడ్డినగర్ డివిజన్ మొత్తానికి ఏపీహెచ్‌బీ కాలనీలోని రెండు పార్కులు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఏపీహెచ్‌బీ కాలనీతో పాటు చుట్టు పక్కల బస్తీలైన ఆదర్శనగర్, గురుమూర్తినగర్, గిరినగర్, సుమిత్రనగర్, చింతల్ డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్, శ్రీసాయి కాలనీ తదితర ప్రజలు ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కులకు వస్తుంటారు. నెల రోజులుగా పార్కులో వాకింగ్ ట్రాక్‌లను తవ్వి వదిలేయడంతో ప్రతిరోజు పార్కులు వచ్చి వెనుదిరుగుతున్నారు.



పార్కు-1లోని లాన్‌లో కలుపు మొక్కలు

- ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న పార్కు-1లో హార్టికల్చర్ అధికారులు పచ్చికను పెంపొందించేందుకు లాన్‌ను ఏర్పాటు చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ కక్కుర్తి పడి నాసిరకంగా పనులు చేపట్టడంతో ప్రస్తుతం గడ్డి మొక్కలు మొలిచాయి. అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో కాంట్రాక్టర్ నాసిరకం లాన్‌ను వేశాడని, దీంతో ప్రజాధనం మొత్తం కలుపు మొక్కల పాలైందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

వాకింగ్ ట్రాక్‌లో కంకర, బురద

పార్కు-01లో వాకింగ్ ట్రాక్‌ను తవ్వి వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలతో నీళ్లు చేరి బురదమయంగా మారింది. దీంతో వాకింగ్‌కు వచ్చే వాళ్లు జారిపడతుండటంతో రావడం మానేశారు. అదే విధంగా పంచవటి పార్కు-2లో వాకింగ్ ట్రాక్‌లో కంకరను గుట్టలుగా పోసి వదిలేశారు. దీంతో కంకరలో నడవడానికి వీలు లేకుండా పోయిందని వాకర్లు వాపోతున్నారు.

వర్షాలకు తేలిన ఓపెన్‌జిమ్ రబ్బర్ మ్యాట్స్

ఏపీహెచ్‌బీ కాలనీ పార్క్-1లో కాంట్రాక్టర్ చేతివాటం ప్రదర్శించడంతో నాసిరకం పనులు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ రబ్బర్ మ్యాట్స్ ఇటీవల కురిసిన వర్షాలకు పైకి లేస్తున్నాయి. కాంక్రీట్ కాకుండా ఇతర మెటీరియల్‌తో చేసిన టైల్స్ వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఓపెన్ జిమ్ పరికరాలు సైతం దెబ్బతినే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లు చేపడతారు..



దాదాపు నెల రోజులుగా రెండు పార్కుల్లో వాకింగ్ ట్రాక్ పనులను సాగదీస్తున్నారు. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసి పత్తా లేకుండాపోయాడు. బురదమంగా మారిన వాకింగ్ ట్రాక్, రాళ్లు తేలిన నడకదారితో వాకింగ్ చేయడమే మానేశాం. పార్కులను త్వరగా అందుబాటులోకి తేవాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం ఉండటం లేదు. కలుపు మొక్కలు పెరకగడంతో కూర్చోవడానికి ఇబ్బందికరంగా మారుతోంది.

– పోపూరి జగన్‌మోహన్‌రావు, కాలనీ వాసి.

పనులు పూర్తయ్యేలా చర్యలు

ఏపీహెచ్ కాలనీలోని రెండు పార్కుల్లో వాకింగ్ ట్రాక్, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయిన విషయం వాస్తవమే. వర్క్ ప్రెజర్‌తో పనులపై దృష్టి సారించలేకపోయాం. గణేశ్ ఉత్సవాల నేపథ్యలో ఏర్పాట్లు పనిలో మా సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. ఉత్సవాలు ముగిసిన వెంటనే సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రఘువీర్‌రెడ్డి, మేనేజర్, అర్బన్ బయోడైవర్సిటీ

ఇళ్లు లేని పేదలకు 100 గజాల స్థలం ఇవ్వాలి

ఎంపీ ఆర్. కృష్ణయ్య

సాక్షి మేడ్చల్ జిల్లా: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సొంతిల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం 100 గజాల స్థలం కేటాయించాలని ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప్పల్ మండలంలోని జైపూర్ కాలనీ నాగోల్ దగ్గర పత్తులగూడ గ్రామంలో దాదాపు 2 వేల మంది కూలీలు చేసుకునే పేద ప్రజలు అసంఘటిత కార్మికులు గుడిసెలు వేసుకుజీవనం సాగిస్తున్నారని వారందరికీ ఇండ్ల పట్టాలివ్వాలన్నారు. అలాగే ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామంలో ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 66లో భూమి కేటాయించి, పట్టాలు ఇచ్చారు కానీ పొజిషన్ ఇవ్వలేదన్నారు. మహానగరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద ప్రజలు ఇంటి అద్దెలు చెల్లించలేక బతుకు భారమై జీవిస్తుంటే ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తుందని మండిపడ్డారు. బాకి రవి, ములుగు నవీన్, సోమయ్య, ఉప్పలయ్య, వెంకన్న, అయ్యన్న, ముర్తయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగులకు క్రీడా పోటీలు

సాక్షి మేడ్చల్ జిల్లా: జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్ కలెక్టరేట్ లో ఉద్యోగులకు వాలీబాల్, రన్నింగ్, చెస్, టగ్ అఫ్ వార్, క్రికెట్, మ్యూజికల్ చైర్, క్యారం బోర్డు వంటి క్రీడా పోటీలను జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ గురువారం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హాజరై మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తిని ఉద్యోగంలో కూడా పాటిస్తే మెరుగైన సేవలు అందించగలరన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా స్పోర్ట్స్ అధికారి జీవీ.గోపాల్ రావు, వివిధ శాఖల అధికారులు, ఏఓ రామ్మోహన్ రావు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిమజ్జన ఘాట్లను పరిశీలించిన కమిషనర్



నిజాంపేట్: గణేష్ నిమజ్జన ఘాట్స్‌ను కమిషనర్ సాబేర్ అలీ, బాచుపల్లి సీఐ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. గణేష్ నిమజ్జన ఘాట్స్ వద్ద నత్త నడకన జరుగుతున్న పనుల గురించి కమిషనర్ ఆరా తీశారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జనం సాఫీగా సాగడానికి గణేష్ ఉత్సవ సమితి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. బాచుపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్లైఓవర్ నిర్మాణం వల్ల ట్రాఫిక్ రద్దీ ఉంటుందని, వివిధ కాలనీల నుంచి నిమజ్జన ఘాట్లకు చేరుకునే విధంగా ట్రాఫిక్‌ను మళ్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి నిజాంపేట్ కార్పొరేషన్ కన్వీనర్ మందపాటి శ్రీధర్ రెడ్డి, స్థానిక నాయకులు నరేంద్ర చౌదరి, భిక్షపతి యాదవ్, సుమన్‌రావు, రవి యాదవ్, సచిన్, సంతోష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు శ్రీనాథ్



సుభాష్‌నగర్: యూనివర్సిటీ యాజమాన్యం అండదండలతోనే విద్యార్థులు మత్తు మందుకు బానిసలుగా మారుతున్నారని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు శ్రీనాథ్ అన్నారు. బహదూర్‌పల్లిలోని మహీంద్ర యూనివర్సిటీలో మాదక ద్రవ్యాలతో విద్యార్థులు పట్టుబడిన సందర్భంగా గురువారం యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహీంద్రా యూనివర్సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ఇలాంటి ఘటన జరగడం సిగ్గుచేటన్నారు. యాజమాన్యం విద్యార్థులపై సరైన నిఘా పెట్టకపోవడం, కేవలం ఫీజుల వసూళ్లకే పరిమితం కావడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. క్యాంపస్‌లో జరుగుతున్న డ్రగ్స్ దందాను రాష్ట్ర ప్రభుత్వ ఈగల్ టీమ్ గుర్తించే వరకు యాజమాన్యం గుర్తించకపోవడం దారుణమన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపైయ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ కన్వీనర్ నగేష్, జిల్లా కన్వీనర్ మృతుంజయ, మహానగర సంయుక్త కార్యదర్శులు భారత్, పర్ధు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథులు

- నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- మండపాల వద్ద భక్తుల పూజలు
- ఆకర్షణీయంగా అలంకరణ

నియోకవర్గంలో నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆయా కాలనీలు, అసోసియేషన్ కమిటీల ఆధ్వర్యంలో వినాయక పూజలు నిర్వహించారు. ఆయా చోట్ల మట్టివినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా మండపాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. పూజలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్



వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీలో పూజలో పాల్గొన్న మహిళలు



శంభీపూర్‌లో గణపతి పూజలో మధుసుదనాచారి, శంభీపూర్ రాజు



జీడిమెట్లలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో..



పేట్‌బషీరాబాద్ ఉడ్స్ కాలనీలో పూజల్లో పాల్గొన్న సంక్షేమ సంఘం ప్రతినిధులు



నిజాంపేట పరిధి జీఎల్ఆర్ కాలనీలోని జాగృతి రెసిడెన్సిలో..



పద్మానగర్ గాయత్రి అపార్ట్‌మెంట్స్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న భక్తులు

వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం!

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. పలు ప్రాంతాల్లో వరదనీటి తీవ్రతతో రోడ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. రోడ్లపై నిలిచిన వరదనీటిని డ్రెయిన్‌లు, భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలను తొలగించి తరలించారు.

– కుత్బుల్లాపూర్



నాలా పనులు నిలిచిపోవడంతో గాంధీనగర్- రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డుపై నిలిచిన వరదనీరు



జీడిమెట్ల ఎస్వి కో ఆపరేటివ్ సొసైటీలో వర్షానికి కూలిన నాలా గోడ



సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో నాలా ఉప్పొంగి ఇళ్లల్లోకి వచ్చిన మురుగునీరు



కోతకు గురైన నర్సాపూర్- గాగిల్లాపూర్ రోడ్డు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం



కేపీహెచ్‌బీకాలనీ: ఊరికి వస్తామంటూ తండ్రికి ఫోన్ చేసి చెప్పిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఊరికి వెళ్లకుండా, ఉద్యోగానికి వెళ్లకుండా కనిపించకుండా పోయిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఎర్రగూడూరుకు చెందిన దాసరి చిన్న రామయ్య కుమారుడు దాసరి వెంకటేశ్వర్లు (28) కేపీహెచ్‌బీ కాలనీలోని మంజీర మెజెస్టిక్ గ్లోబ్ లైన్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. స్థానికంగా ఉన్న హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 24న తండ్రికి ఫోన్ చేసి 26 నాడు ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. 25న అతను పని చేసే కంపెనీ హెచ్ఆర్ చిన్న రామయ్యకు ఫోన్ చేసి వెంకటేశ్వర్లు కంపెనీకి రాలేదని, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తున్నదని తెలిపాడు. దీంతో చిన్న రామయ్య సైతం వెంకటేశ్వర్లుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: కాలనీ సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన మోడీ బిల్డర్స్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్‌ను కలిశారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన ఆయన సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా పని చేయాలన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనుంజయ్, సెక్రటరీ చందు, ట్రెజరర్ జెసి రెడ్డి, ఉపాధ్యక్షులు శైలజ, కాలనీ సభ్యులు సౌరబ్ సింగ్, మోహన్ జా, కులకర్ణి, ఉదయన్, ఉషాకల్యాణి, రాజు, వెంకట్, గణేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కీసర: భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కీసర తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పరిష్కారం కానీ దరఖాస్తులను వెంటనే ప్రభుత్వానికి విన్నవించి నిబంధనల ప్రకారం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే కులం, స్థానికత, ఆదాయం, ఇతర సర్టిఫికెట్లను నిర్దేశించిన సమయంలోగా జారీ చేయాలని సూచించారు.